ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 245 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 06 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole




# కర్నూలు ఎయిర్‌పోర్టుకు మహర్దశ..



ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు విమానాశ్రయం ఓర్వకల్ వద్ద ఉన్న విమానాశ్రయం. ఇది జాతీయ రహదారి 40 తూర్పు వైపున, కర్నూలు నుండి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్, నిర్మించింది.మారుమూల ప్రాంతాల సంపర్కాలను మెరుగుపరిచేందుకు తక్కువ ఖర్చుతో కూడిన విమానాశ్రయాల అభివృద్ధి కోసం 2013 లో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 50 స్థానాల్లో కర్నూలు ఒకటి. విమానాశ్రయం 639 ఎకరాలకు పైగా విస్తరించి ఉంది. 456 ఎకరాలు పుడిచెర్లా కింద, ఓర్వకల్‌లో 115 ఎకరాలు, కన్నమడకాలలో 67 ఎకరాలు ఉన్నాయి.భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 2016లో ఓర్వకల్ స్థలాన్ని ఆమోదించింది. ఫిబ్రవరి 2017 లో రాష్ట్ర భూకేటాయింపులను ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జూన్ 2017 లో శంకుస్థాపన చేయగా,విమానాశ్రయం పనులు 18 నెలల్లో పూర్తయ్యాయి, రన్వే ప్రయోగాత్మక ఉపయోగం 2018 డిసెంబరులో విజయవంతంగా జరిగింది.



పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

## విమానాశ్రయానికి రూ.4.43 కోట్లు

## నిధులు విడుదల చేసిన ప్రభుత్వం




ఈ విమానాశ్రయాన్ని 2019 జనవరి 8న ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. 2021 మార్చి 28 న ఇండిగో కర్నూలు నుండి బెంగళూరు, విశాఖపట్నం,చెన్నై నగరాలకు విమాన సేవలు ప్రారంభించారు. ఇప్పుడు కొత్తగా కర్నూలు ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విమానాల సంఖ్య కూడా పెంచేందుకు ఆలోచన చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఎయిర్‌పోర్ట్‌లపై ఫోకస్ పెట్టింది. పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ప్రతినిధులు రాష్ట్రానికి వస్తారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌లలో అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కర్నూలు విమానశ్రయంలో అవసరమైన పనుల చేపట్టేందుకు నిధులు విడుదల చేసింది. అలాగే కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీస్లు నడపాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడ్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు విమానాశ్రయానికి రూ.4.43 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ కర్నూలు ఎయిర్ పోర్ట్ చేసింది. అవసరమైన అభివృద్ధి పనుల కోసంపోర్ట్ ఈ నిధులు విడుదల చేయగా.. ఆర్ఈఎస్ఏ (రెక్టిఫికేషన్ ఆఫ్ రన్వే ఎండ్ సేఫ్టీ) పనుల కోసం రూ.3.6 కోట్లు ఖర్చు చేసేందుకు అనుమతించింది.

## అలాగే విమానాశ్రయం భద్రత కోసం కమ్యూనికేషన్

ఎలక్ట్రానిక్ పరికరాల నిర్వహణకు మిగిలిన రూ.83 లక్షలు ఖర్చు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. మరోవైపు మంత్రి టీజీ భరత్ ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిశారు. కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీసులు నడపాలని కోరారు. తన విన్నపంపై రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు మంత్రి టీజీ భరత్. 'త్వరలో సర్వీసు నడిపేందుకు వీలుగా కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. సాధ్యాసాధ్యాలపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి. విమాన సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు వెసులుబాటు ఉంటుంది' అని మంత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. కర్నూలు ఎయిర్‌పోర్టుకు నిధులు విడుదల చేయడంపైనా స్పందించారు.. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు మంత్రి టీజీ భరత్ ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కూడా కలిశారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని కోరారు. 'రాష్ట్రంలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులకు అనుమతులిచ్చే విషయమై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించాను. రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని రక్షణ మంత్రి హామీ ఇచ్చారు. వాటిపై 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని చెప్పారు. ఎట్టకేలకు కర్నూలు ఎయిర్ పోర్ట్ కు మంచి రోజులు రానున్నాయి.

భద్రాచలంలో వైభవోపేతంగా

# శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది.

భద్రాచలం, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో శ్రీరామచంద్రమూర్తి సీతమ్మవారి మెడలో మాంగళ్య ధారణ చేశారు. మిథిలా మైదానంలో ఈ కల్యాణ క్రతువును ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులన్నీ రామ నామస్మరణతో మార్మోగాయి. తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తన సతీమణి గీతతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



# రాములోరికి పట్టువస్త్రాలు

## సమర్పించిన సీఎం రేవంత్

భద్రాచలంలో సీతారాముల కళ్యాణోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీతతో కలిసి హాజరయ్యారు.



భద్రాచలం, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీతతో కలిసి హాజరయ్యారు. స్వామివారికి రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాంగణమంతా రామ నామస్మరణతో మార్మోగుతోంది. తితిదే తరపున ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.


# వృద్ధి రేటులో రెండో స్థానంలోకి ఏపీ..

# ప్రజల సమష్టి విజయమన్న సీఎం చంద్రబాబు

దేశంలో వృద్ధిరేటు మెరుగ్గా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ టాప్లోకి వచ్చింది. స్థిర ధరల్లో 8.21 శాతం వృద్ధి రేటుతో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. 9.69 శాతంతో తమిళనాడు మొదటి స్థానంలో ఉంది.

అమరావతి, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో వృద్ధిరేటు మెరుగ్గా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ టాప్లోకి వచ్చింది. స్థిర ధరల్లో 8.21 శాతం వృద్ధి రేటుతో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. 9.69 శాతంతో తమిళనాడు మొదటి స్థానంలో ఉంది. ఈ మేరకు సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ నివేదిక విడుదల చేసింది. ఏడాది కాలంలో ఏపీ వృద్ధి రేటు 2.02 శాతం పెరిగి 8.21గా నమోదైంది.





ప్రస్తుత ధరలు విభాగంలో 12.02 శాతంగా ఉంది. వృద్ధిరేటులో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానానికి చేరడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్' అంటూ సీఎం పోస్ట్ చేశారు. కూటమి ప్రభుత్వ చర్యలతో వృద్ధి రేటు సాధించామని పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ప్రజల సమష్టి విజయమంటూ చంద్రబాబు అభినందనలు తెలిపారు. బంగారు భవిష్యత్తు కోసం కలిసి ప్రయాణం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

# నిరవధిక నిరాహార దీక్ష విరమించిన

# జగ్జీత్ సింగ్ దల్లేవాల్

రైతుల డిమాండ్ల సాధనే లక్ష్యంగా రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్షను విరమించారు.

ఢిల్లీ, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): దేశంలోని అన్నదాతల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను నేడు విరమించారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీతో పాటు పలు డిమాండ్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గతేడాది నవంబర్ 26న ఆయన ఈ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దానిని విరమించుకోవాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహాన్, కేంద్రరైల్వేశాఖ సహాయమంత్రి రణ్వీత్సింగ్ బిట్టు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ మేరకు పంజాబ్లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిర్హింది నిర్వహించిన 'కిసాన్ మహా పంచాయత్'లో నిరవధిక నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు దల్లేవాల్ ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'అమరణ నిరాహార దీక్ష విరమించాలని మీరంతా నన్ను కోరారు. ఈ ఉద్యమాన్ని జాగ్రత్తగా నడిపినందుకు మీకు రుణపడి ఉంటాను. మీ సెంటిమెంట్లను నేను గౌరవిస్తూ.. మీ ఆదేశాలను పాటిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూరీర్ మోర్చా (కేఎంఎం) కలిసి ఏర్పాటు చేసిన వేదికలో కీలక నేతగా ఉన్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్ కేంద్రం తమ డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ గతేడాది నవంబర్ 26న నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం జనవరిలో రైతులను చర్చలకు ఆహ్వానించడంతో దీక్ష చేపట్టిన స్థలంలోనే వైద్య సాయం తీసుకొనేందుకు ఆయన అంగీకరించారు. కానీ, తన నిరాహార దీక్షను మాత్రం కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే శనివారం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్వీట్ చేశారు. కేంద్రంతో రైతు సంఘాల ప్రతినిధుల చర్చలు కొనసాగుతున్నాయని.. మే 4న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దల్లేవాల్ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



## కృష్ణా నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి

కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరామనవమి సందర్భంగా కృష్ణా నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి చెందారు.

అవనిగడ్డ, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరామనవమి సందర్భంగా కృష్ణా నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి చెందారు. ఆదివారం ఉదయం మత్తి వెంకట గోపి కిరణ్(15), ఎం. వీరబాబు(15), ఎం. వర్ధన్(16) స్నానానికి నదిలోకి దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. డీఎస్పీ విద్యాశ్రీ ఆధ్వర్యంలో సీఐ యువ కుమార్, ఎస్ ఐ శ్రీనివాసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో సీఎం రేవంత్ భోజనం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలో పర్యటించారు.




బూర్గంపాడు, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలో పర్యటించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. వారి కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు భద్రాచలంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1896 :** ఏథెన్స్‌లో మొట్టమొదటి ఆధునిక ఒలింపిక్ క్రీడలు ప్రారంభించబడ్డాయి.
- **1919 :** రౌలట్ చట్టానికి నిరసనగా మహాత్మా గాంధీ భారతీయులందరినీ జాతీయ అవమాన దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చారు.
- **1922 :** వక్త, సాహితీ వ్యాఖ్యాత శ్రీభాష్యం అప్పలాచార్యులు జననం (మ. 2003).
- **1928 :** డీఎన్ఏను కనుగొన్న శాస్త్రవేత్త జేమ్స్ వాట్సన్ జన్మించాడు.
- **1930 :** మహాత్మాగాంధీ నేతృత్వంలో గుజరాత్‌లోని దండి వద్ద ఉప్పు సత్యాగ్రహం ముగిసింది. (చిత్రంలో)
- **1931 :** కమ్యూనిస్టు నేత నల్లమల గిరిప్రసాద్ జన్మించాడు (మ. 1997).
- **1956 :** భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు దిలీప్ వెంగ్‌సర్కార్ జననం.
- **1989 :** గుజరాతీ భాషా రచయిత పన్నాలాల్ పటేల్ మరణం (జ. 1912).
- **2002 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర 9వ ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ మరణం (జ. 1931).
- **2011 :** దక్షిణ భారత సినిమా నటి సుజాత మరణం (జ. 1951).


ఏథెన్స్



మహాత్మా గాంధీ


శ్రీభాష్యం అప్పలాచార్యులు


జేమ్స్ వాట్సన్


ఉప్పు సత్యాగ్రహం


నల్లమల గిరిప్రసాద్


దిలీప్ వెంగ్‌సర్కార్


పన్నాలాల్ పటేల్


భవనం వెంకట్రామ్


సుజాత

రిపబ్లిక్ స్పోర్ట్స్

## 'లార్డ్' మీ వైపే ఉంటే టెన్షన్ ఎందుకు గోయెంకా సర్?:రోహిత్

ముంబయి ఇండియన్స్‌కు ఈ సీజన్లోనూ పెద్దగా కలిసిరావడం లేదు. రోహిత్ శర్మ బ్యాటింగ్ లోనూ విఫలం కావడం అభిమానులను నిరాశకు గురి చేస్తోంది. అయితే, అతడు లఖ్నవూతో మ్యాచ్ సమయంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.



ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ మూడో ఓటమిని చవిచూసింది. లఖ్ నవూ సూపర్ జెయింట్స్ తో శుక్రవారం జరిగిన మ్యాచ్లో 12 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. ఈ మ్యాచ్లో రోహిత్ శర్మ ఆడలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన లఖనవూ 203/8 స్కోరు చేసింది. తొలి వికెట్కు మిచెల్ మార్ష్-ఐదెన్ మారమ్ 76 పరుగులు జోడించారు. తొలి టైమ్ ఔట్ సమయంలో రోహిత్ మైదానంలోకి వచ్చి బౌలర్లకు సూచనలు ఇచ్చాడు. స్లో బంతులను సంధించాలన్నాడు. ఇది బాగానే వర్కౌట్ అయింది. స్వల్ప వ్యవధిలో వికెట్లూ పడ్డాయి. ఆ సమయంలో కామెంట్రీ చేస్తోన్న సబా కరీం స్పందిస్తూ.. "మైదానంలో 11 మంది ప్లేయర్లు ఉన్నారు. అయితే, రోహిత్ శర్మ బయట నుంచి వచ్చాడు. 'నెమ్మదిగా బంతులేయండి' అని అన్నాడు. అదే హార్దిక్ చేశాడు. స్లో బౌన్సర్ సంధించాడు. అక్కడ ఫలితం అద్భుతం. పూరన్ కొట్టిన బంతి నేరుగా దీపక్ చాహర్ చేతిలో పడింది. అద్భుతమైన వ్యూహం" అని వ్యాఖ్యానించాడు.

### మ్యాచ్ ముగిశాక..

మ్యాచ్లో ముంబయి 191/5 స్కోరుకే పరిమితమైంది. లఖ్నవూ విజయం సాధించాక కూడా రోహిత్ మైదానంలో ఉత్సాహంగానే ఉన్నాడు. ఈ సందర్భంగా లఖ్నవూ యజమాని సంజీవ్ గోయెంకాతో సంభాషించాడు. అదే సమయంలో శార్దూల్ ఠాకూర్ వారి వద్దకు వస్తుండగా రోహిత్ మాట్లాడుతూ.. "సర్ మీరు ఎందుకు ఆందోళన పడతారు. మీ వైపు లార్డ్ ఉండగా టెన్షన్ అవసరంలేదు" అని అన్నాడు. మ్యాచ్ అనంతరం ఓటమి ఎదురైతే కెప్టెను సంజీవ్ గోయెంకా మందలిస్తుంటాడని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ వీడియోను లఖ్నవూ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడంతో నెట్టింట వైరల్ గా మారింది. శార్దూల్ను అంతా 'లార్డ్' అంటూ పిలుస్తుంటారు. అయితే, ఈ మ్యాచ్లో శార్దూల్ ఒక్క వికెట్ మాత్రమే తీసి 40 పరుగులు ఇచ్చాడు. ఇప్పటి వరకు నాలుగు మ్యాచుల్లో 7 వికెట్లు తీశాడు.

# అదిరిపోయేలా రామ్ చరణ్ 'పెద్ది' గ్లింప్స్..
# ఆ ఒక్క 'షాట్' హైలైట్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ద'.
తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్ విడుదలైంది.




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ద'. జాన్వీకపూర్ కథానాయిక. గ్రామీణ నేపథ్యంలో క్రికెట్ బ్యాక్ డ్రాప్లో ఈ సినిమా రూపొందుతోన్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని టీమ్ తాజాగా 'పెద్ది గ్లింప్స్' విడుదల చేసింది. సినిమాలో రామ్చరణ్ పాత్ర ఏవిధంగా ఉండనుందో ఈవీడియోతో టీమ్ తెలియజేసింది. మాస్ అవతార్లో చరణ్ లుక్ ప్రేక్షకులకు కన్నుల పండుగగా అనిపించింది. "ఏదైనా ఈ నేలమీద ఉన్నప్పుడే సేసేయాలు.. పుడతామా ఏటి మళ్లీ..!' అంటూ ఆయన ఉత్తరాంధ్ర యాసలో చెప్పిన డైలాగ్లు ఈలలు వేయించేలా ఉన్నాయి. ముఖ్యంగా గ్లింప్స్ చివర్లో చరణ్ కొట్టిన సిక్స్ షాట్ మాత్రం వావ్ అనిపించేలా ఉంది. రెహమాన్ ఈచిత్రానికి స్వరాలు అందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఇది విడుదల కానుంది.

### ఆ స్టార్ హీరోయిన్ దెయ్యంలా నవ్వుతుందన్న నిర్మాత..
## ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న నెటిజన్లు

బాలీవుడ్లో పేరు పొందిన ఓ హీరోయిన్ని ఉద్దేశించి నిర్మాత చేసిన వ్యాఖ్యలను దర్శకుడు తాజాగా ఓ ఇంటర్వ్యూలో బయట పెట్టారు. నిర్మాత వ్యాఖ్యలపై ఆమె అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బాలీవుడ్‌లో పేరు పొందిన హీరోయిన్స్‌లో శ్రద్ధాకపూర్ ఒకరు. ఇటీవల ఆమె 'స్త్రీ 2'తో విజయాన్ని అందుకున్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలోకి ఆమెను కథానాయికగా ఎంపిక చేసుకోవడంపై చిత్ర దర్శకుడు అమర్ కౌశిక్ స్పందించారు. ఆమెను ఎంపిక చేసింది తాను కాదని తెలిపారు. ఆ నిర్ణయం పూర్తిగా నిర్మాత దినేశ్ విజయే అని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఆమెను దినేశ్ ఎందుకు ఎంపిక చేశారో కూడా బయట పెట్టారు. "స్త్రీ' చిత్రాన్ని తెరకెక్కించాలని నిర్ణయించుకున్నాక కథానాయికగా ఎవరిని తీసుకుంటే బాగుంటుందా? అని మేము ఎంతగానో ఆలోచించాం. అలాంటి సమయంలో శ్రద్ధా కపూర్ పేరును ప్రతిపాదించారు. నిర్మాత దినేశ్ విజయ్. కాబట్టి ఆ క్రెడిట్ పూర్తిగా ఆయనకే దక్కుతుంది. ఆ పాత్ర కోసం ఆమెను ఎంచుకోవడానికి గల కారణాన్ని కూడా నాతో చెప్పారు. ఓసారి శ్రద్ధాకపూర్, దినేశ్ ఒకే ఫ్లైట్లో ప్రయాణించారు. చాలా సేపు సరదాగా మాట్లాడుకున్నారట. ఆమె అచ్చం దెయ్యంలా నవ్వుతుందని.. అందువల్ల ఈ పాత్రకు తను అయితే పూర్తి న్యాయం చేయగలదని ఆయన నాతో చెప్పారు" అని అమర్ కౌశిక్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. నిర్మాత తీరును శ్రద్ధా కపూర్ అభిమానులు తప్పుపడుతున్నారు. ఆమెను హీరోయిన్గా పెట్టి మీరు డబ్బులు సంపాదించుకుని ఈ విధంగా మాట్లాడటం ఏమీ బాగోలేదని కామెంట్స్ చేస్తున్నారు. 2010లో విడుదలైన 'తీన్ పట్టి'తో కథానాయికగా ఎంట్రీ ఇచ్చారు శ్రద్ధా కపూర్. 'ఆషికీ 2' ఆమె కెరీర్ను మలుపు తిప్పింది. ఈ సినిమాలో ఆమె నటన సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద ఇది భారీగా వసూళ్లు రాబట్టింది. 'ఏక్ విలన్', 'భాఘి', 'ఓకే జాను', 'స్త్రీ', 'స్త్రీ 2' వంటి చిత్రాలతో ఆమె ప్రేక్షకులను అలరించారు. 2019లో విడుదలైన 'సాహో'తో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# నిజమే.. మేము కొట్టుకున్నాం కానీ..
## :సిద్ధూ జొన్నలగడ్డ క్లారిటీ

సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ రూపొందించిన చిత్రం 'జాక్. ఈ సినిమాలో హీరోయిన్గా తొలుత -పూజాహెగ్డేను అనుకున్నట్లు వస్తున్న వార్తలపై సిద్ధూ జొన్నలగడ్డ తాజాగా స్పందించారు.



సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ రూపొందించిన చిత్రం 'జాక్'. వైష్ణవి చైతన్య కథానాయిక. ఈ సినిమాలో హీరోయిన్గా తొలుత పూజా హెగ్డేను అనుకున్నట్లు వస్తోన్న వార్తలపై తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సిద్ధూ జొన్నలగడ్డ స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని అన్నారు. ఈ కథకు పూజాహెగ్డేను తీసుకోవాలనే ఆలోచన ఏమాత్రం లేదని.. మొదటి నుంచి తాము అనుకున్నది వైష్ణవి చైతన్య పేరేనని చెప్పారు. మరో ఇంటర్వ్యూలో ఆయన దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్తో క్రియేటివ్ డిఫరెన్సెస్ (సృజనాత్మక విభేదాలు) తలెత్తాయనే ప్రచారంపై మాట్లాడారు. సినిమా విషయంలో అలాంటివి సహజం అన్నారు. "క్రియేటివ్ డిఫరెన్సెస్ తలెత్తిన మాట వాస్తవమే. మేము సినిమా కోసమే కొట్టుకున్నాం. తీవ్రంగా చర్చించుకున్నాం. సినిమా అన్నాక ఇలాంటివి సహజం. అంతేకానీ, మేము ఏమాత్రం వ్యక్తిగత కారణాల వల్ల తిట్టుకోలేదు. సోషల్మీడియాలో పెట్టే ఒక చిన్న పోస్ట్ విషయంలోనే స్నేహితుల మధ్య అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. అలాంటిది రెండున్నర గంటల సినిమా చేస్తున్నప్పుడు ఇలాంటివి ఉండటంలో తప్పు లేదు" అని సిద్ధూ జొన్నలగడ్డ చెప్పారు. అనంతరం ఆయన 'టిల్లు స్క్వేర్' గురించి మాట్లాడుతూ.. "నిజం చెప్పాలంటే, ఆ సమయానికి నాకు 'టిల్లు స్క్వేర్' చేయడం ఏమాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే, 'డీజే టిల్లు' చేయడానికి నా వద్ద ఒక కథ ఉంది. ఆ ధైర్యంతోనే సినిమా చేశా. కానీ సీక్వెల్ కు వచ్చేసరికి నా వద్ద కథ లేదు. కరోనా కారణంగా పార్ట్ 1కు రావాల్సిన గుర్తింపు ఒకింత తగ్గిందనే భావన మాత్రం మా టీమ్లో ఉండిపోయింది. కాబట్టి, మరోసారి ఇదే తరహా కథ చేసి ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకుందామని నిర్ణయించుకుని సుమారు రెండేళ్లపాటు శ్రమించి సీక్వెల్ చేశాం. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డబ్బులు బాగానే కలెక్ట్ చేసింది. డబ్బులు కోసమే సినిమాలు చేయాలనుకుంటే టిల్లు తర్వాత నాకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. వాటికి అంగీకారం తెలిపితే నాకు పెద్ద మొత్తంలో డబ్బు అందేది. కానీ, నా ఫోకస్ మొత్తం ఇండస్ట్రీలో ఎక్కువ కాలం కొనసాగాలనే దానిపైనే ఉంది. అందుకే రెండేళ్ల శ్రమించి సినిమా చేశాం" అని వివరించారు. 'జాక్ తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని చెప్పారు. వైష్ణవి పాత్ర చాలా అద్భుతంగా ఉంటుందని.. ఆమెకు సంబంధించిన సీన్స్ను కావాలనే రివీల్ చేయలేదని తెలిపారు.

## ఇంటి చిట్కాలు


# ఇప్పుడు చెప్పే పదార్థాలని మిక్సీ పడితే కొత్త మిక్సీ అయినా పాడవుతుంది, మిక్సీ పట్టేటప్పుడు కొన్ని తప్పులు అసలే చేయొద్దు

కిచెన్‌లో ముఖ్య వస్తువుల్లో మిక్సీ కూడా ఒకటి. ఇందులో మసాలాలు, అల్లం, పండ్ల రసాల కోసం మిక్సీని వాడతారు. దీనిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో తెలుసుకోండి.

టెక్నాలజీ మనకి అన్నీ పనులని ఈజీగా చేసింది. ఇందులో వంట, కిచెన్‌లోని పనులని కూడా ఈజీ చేశాయి. ఇదివరకటి రోజుల్లో అల్లం, జ్యూస్‌లు, మసాలాలు రుబ్బుకోవాలంటే రోలు వాడేవారు. కానీ, ఇప్పుడు గ్రైండర్స్, మిక్సర్స్ వాడుతున్నారు. దీంతో గంటలో అయ్యే పని క్షణాల్లోనే పూర్తవుతుంది. అల్లం, మసాలాలు, జ్యూస్‌లు ఇలాంటి పదార్థాలన్నింటినీ మిక్సీలో పడుతుంటారు. ఇవి సరిగా పనిచేయాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.



### కార్బోనేటెడ్ డ్రింక్స్



కార్బోనేటెడ్ డ్రింక్స్‌లో ఎక్కువగా కార్బోనేటెడ్ ఉంటుంది. ఈ డ్రింక్స్‌ని బ్లెండర్‌లో వేయడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. నురుగు వస్తుంది. దీంతో ప్రెజర్ పెరిగి పేలుతుంది. కాబట్టి, కార్బోనేటెడ్ డ్రింక్స్‌ని ఎప్పుడు కూడా బ్లెండర్‌లో వేయొద్దు.

### స్టార్చ్ కూరగాయలు




బంగాళాదుంపలు, ఇతర పిండి పదార్థాలను కూడా బ్లెండర్‌లో వేయడం మంచిది కాదు. ఎందుకంటే ఆల్రెడీ అందులో ఎక్కువగా స్టార్చ్ ఉంటుంది. మిక్సీ, గ్రైండర్‌లో వేసినప్పుడు అవి మరింత స్టార్చ్‌ని విడుదల చేస్తాయి. దీని వల్ల సరిగా పనిచేయవు. అనుకున్నట్లుగా అవి బ్లెండ్ అవ్వవు.

### ఫ్రోజెన్ ఫుడ్స్



స్మూతీలు తయారు చేయడానికి గ్రైండర్స్, బ్లెండర్స్ చాలా మంచివి. కానీ, పండ్లు, బాదం వెన్న వంటి ఫ్రోజెన్ ఫుడ్స్ వాడడం వల్ల బ్లెండర్ కంటైనర్, బ్లేడ్స్ విరిగిపోవచ్చు. ఎందుకంటే, ఎక్కువగా ఫ్రోజెన్ ఫుడ్స్ ఘనపదార్థాలుగా ఉంటాయి. అలాంటి వాటిని బ్లెండర్స్‌లో వేయకపోవడమే మంచిది.

### నట్స్, డ్రై ఫుడ్స్



అవకాడో, ఆప్రికాట్స్ వంటి పెద్ద విత్తనాలు ఉన్న పండ్లని ఎప్పుడు కూడా బ్లెండర్స్‌లో వేయొద్దు. ఇలా చేయడం వల్ల పండ్ల విత్తనాలు బ్లేడ్‌లో ఇరుక్కుపోతాయి. బ్లేడ్స్ విరిగిపోయేలా చేస్తాయి. ఇంకా డ్రై ఫుడ్స్‌లో జిగటగా ఉండడం వల్ల అది బ్లేడ్‌కి అంటుకుని సరిగా పనిచేయవు.

### వేడివేడివి ఎందుకు వాడొద్దు



బ్లెండర్‌లో వేడి పదార్థాలను వాడొద్దు. వీటిని వల్ల ఆవిరిని ఉత్పత్తి చేస్తాయి. ఇది బ్లెండర్‌పై ప్రెజర్‌ని పెంచుతాయి. దీని వల్ల మిక్సర్ ఆన్ చేయడం వల్ల మూత పగిలిపోవచ్చు. ఈ టైమ్‌లో పేలడం వల్ల మీకు కూడా గాయాలయ్యే అవకాశం ఉంది. కాబట్టి, అలా ఎప్పుడు చేయొద్దు.

### ఓవర్‌లోడ్ వద్దు



మిక్సీ, గ్రైండర్‌లో ఓవర్‌లోడ్ వద్దు. దీని వల్ల వాటి పనితనం తగ్గే అవకాశం ఉంది. కాబట్టి, కొద్దికొద్దిగా మిక్సీ పట్టండి. దీంతో త్వరగా మిక్సీ జార్స్ పాడవవ్వు. మిక్సీ మోటర్‌పై ఎఫెక్ట్ పడదు. తక్కువ పరిమాణంలోనే ఉంచి మిక్సీ పట్టండి.

### మూతపెట్టకుండా మిక్సీ పట్టడం



కొంతమంది కొద్ది పదార్థామే ఉంది కదా అని మూతకూడా పెట్టకుండా మిక్సీ పడతారు. వీటి వల్ల చాలా సమస్యగా ఉంటుంది. ఫుడ్ అంత కూడా బయటికి పడే అవకాశం ఉంది. మనపై కూడా పడుతుంది. చుట్టూ ఉన్న పరిసరాలపై కూడా ఆ ఎఫెక్ట్ పడుతుంది. అదే విధంగా, ఏ పదార్థాలకి ఏ జార్ వాడాలో తెలుసుకుని వాడండి. అంటే కొన్ని జార్స్ మసాలాలకి పనికొస్తే, మరికొన్ని జ్యూస్‌లకి మాత్రమే పనికొస్తాయి. ఇలా వేటికి ఏం ఉపయోగించాలో తెలుసుకుని వాడండి.